ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 18 మార్చి 2024



బెంగళూరులో 100 చెక్‌పోస్టులు

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బెంగళూరు వ్యాప్తంగా వంద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెక్‌పోస్ట్‌లు 24/7 పనిచేస్తాయన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో 3 చెక్‌పోస్టులు ఉంటాయన్నారు. పోలీసులు, బీబీఎంపీ, ఆర్టీఓ, అబ్కారి, వాణిజ్యపన్నులశాఖ అధికారులు వీటిని పర్యవేక్షిస్తారన్నారు. నగదు, మద్యం, ఇతరత్రా వస్తువులు పట్టుబడితే వెంటనే జప్తు చేస్తామన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా సీఐఎస్ఎఫ్ ఒక ప్లటూన్ వ చ్చిందన్నారు.

సేవాతత్పరులు.. ఈ నాయకులు

● బీజేపీ నుంచి బరిలో నలుగురు సమాజ సేవకులు ● అధిష్టానం అనూహ్య నిర్ణయం



బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అభ్యర్థుల ఎంపికలో భిన్నమైన విధానాలు పాటిస్తుందనే అంశాన్ని మరోసారి రుజువు చేశారు. సాధారణంగా రాజ్యసభ అభ్యర్థులుగా సమాజంలో వివిధ రంగాల్లో విజయం సాధించిన వారికి అవకాశాలు కల్పిస్తారు. తాజాగా రాజ్యసభకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్మన్ సుధామూర్తిని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 20 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా నలుగురు సేవాసాధకులను రంగంలోకి దించిన అధిష్టానం అందరికీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. వీరిలో రాష్ట్రంలోనే కాకుండా దేశ విదేశాల్లోనూ ప్రముఖ హృద్రోగ నిపుణులుగా రాణించిన డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను బెంగళూరు గ్రామీణ అభ్యర్థిగా చేసింది. ఇక మాజీ సైనికుడు కెప్టెన్‌బ్రిజేశ్ చౌటను దక్షిణకన్నడ నుంచి, మైసూరు నుంచి రాజకుటుంబానికి చెందిన యదువీర్‌ను, ప్రముఖ డాక్టర్‌గా ఉత్తరకర్ణాటక జిల్లాల్లో పేరొందిన డాక్టర్ బసవరాజ క్యావటూర్‌ను కొప్పళ అభ్యర్థిని చేశారు. ఇద్దరు వైద్యులు, ఓ మాజీ సైనికుడు, యువరాజు వంటివారితో రాష్ట్రవ్యాప్తంగా వారితో ప్రచారం చేయించాలనే ఆలోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది.

26 వేలకు పైగా గుండె ఆపరేషన్లు..



ప్రభుత్వ జయదేవ హృద్రోగ ఆసుపత్రుల డైరెక్టర్ మంజునాథ్ సుపరిచితుడు. 17ఏళ్లపాటు డైరెక్టర్‌గా కొనసాగారు. వైద్యుడిగా 26వేలకుపైగా గుండె ఆపరేషన్లు చేశారు. వైద్య రంగంలో ఆయన సరికొత్త విధానాలు అమలులోకి తెచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ఆయనను అభిమానించేవారు ఉన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా జయదేవ ఆసుపత్రిలో సేవలను అమలు చేశారు. రోగికి 'తొలుత వైద్యం - తర్వాత ఫీజు' అనే విధానం ఎంతోమందిని ఆకట్టుకుంది. పేద, మధ్య తరగతికి చెందిన ప్రజలు డాక్టర్ మంజునాథ్ అంటే ప్రత్యేక అభిమానం చూపుతారు.

సైన్యం నుంచి రిటైరై రాజకీయాల్లోకి...



ఇక కెప్టెన్ బ్రిజేశ్ చౌట దక్షిణకన్నడ జిల్లా వాసి. బీఎస్సీ చదివిన ఆయన గూర్ఖా రెజిమెంట్ విభాగంలో ఏడేళ్లపాటు మిలిటరీలో కొనసాగారు. ఆయన సైన్యంలో కొనసాగుతున్నపుడే మణిపుర, అస్సోంలలో చోటుచేసుకున్న ఘటనల్లో కీలక భూమిక పోషించారు. మిలిటరీ నుంచి వెనుదిరిగి వచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేశారు. దీనికితోడు సమర్థన్ ఫౌండేషన్ ద్వారా మంగళూరులో సమాజసేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. 2013లో బీజేపీలో చేరిన ఆయన సాహిత్య సమ్మేళనాలు కేవలం మహానగరాలలోనే కాకుండా మారుమూల గ్రామ తాల్లోనూ జరపాలని భావించారు. 2019లో మంగళూరులో సాహిత్య సమ్మేళనాన్ని నిర్వహించారు. కంబళపై నిషేధం విధించినప్పుడు న్యాయపోరాటంలో కీలకంగా వ్యవహరించారు. ఓ మాజీ సైనికుడు బీజేపీ అభ్యర్థి కావడం సర్వత్రా ప్రత్యేకత అనిపిస్తోంది.

యువరాజు యదువీర్

మైసూరు రాజ కుటుంబానికి రాజకీయాలు కొత్త కాకపోయినా దశాబ్దాల తర్వాత యదువీర్ మరోసారి ప్రవేశించారు. శ్రీకంఠదత్త ఒడయార్ మృతి తర్వాత ఆయన సమీపబంధువు అయిన యదువీర్ యువరాజుగా బాధ్యతలు చేపట్టారు. మైసూరులో జరిగే ప్రతిష్ఠాత్మక దసరా ఉత్సవాలలో రాజసంప్రదాయాన్ని గంభీరంగా కొనసాగిస్తున్నారు. యదువీర్ మసాచుసెట్స్ యూనివర్సిటీలో పట్టభద్రుడు. మైసూరు సాంస్కృతిక పరంపరను సంరక్షించే విషయంలో ఆయన బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారు.

హెల్త్‌క్యాంప్‌లకు మారుపేరు బసవరాజ క్యావటూర్



వెనుకబడిన ఉత్తరకన్నడ జిల్లాలో ఆర్థోవైద్యుడిగా డాక్టర్ బసవరాజ క్యావటూర్ చిరపరిచితులు. ఆయన సుదీర్ఘకాలంగా గ్రామీణ ప్రాం తాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆర్థోసేవలు కొనసాగించడం, ఆరోగ్యంపట్ల ప్రజల్లో చైతన్యం కలిగించడం ద్వారా ఎంతో పేరొందారు. ఇలా నలుగురూ భిన్నమైన సమాజసేవ ద్వారా పేరొంది తొలిసారి అభ్యర్థులయ్యారు. ప్రజల్లో అపారమైన అభి మానాన్ని సంపాదించుకున్న వీరితో విజయం సులువుగా సాధించవచ్చని పార్టీ భావిస్తోంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

నేడు శివమొగ్గకు ప్రధాని

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల రోజునే కలబురగిలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రెండురోజుల వ్యవధిలోనే మరోసారి రాష్ట్రానికి ప్రధాని వస్తున్నారు. సోమవారం శివమొగ్గలో ప్రచారసభలో ప్రధాని పాల్గొంటున్నారు. స్థానిక ఎంపీ బీవై రాఘవేంద్రకు మద్దతుగా ప్రచారం చేస్తారు. అల్లమప్రభు మైదానంలో భారీ ఏర్పాట్లు సాగుతున్నాయి. బీజేపీ సీనియర్ నేత యడియూరప్పతోపాటు పలువురు ఆదివారం పరిశీలన జరిపారు. శివమొగ్గ ప్రజలకు ఇచ్చిన హామీకి అనుగుణంగానే విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కలబురగి సభతో రాష్ట్రంలో ఒక్కసారిగా పార్టీ కార్యకర్తల్లో జోష్ పెరిగింది. శివమొగ్గ సభ ద్వారా మరెటువంటి వాగ్దానాలు చేస్తారోననే కుతూహలం పెరిగింది.

మోగిన రెబెల్





రంజాన్ వేళలు

ఇఫ్తార్	: సోమవారం సాయంత్రం 06:31
సెహరి	: మంగళవారం ఉదయం 05:11

● రెబెల్‌గా పోటీకి ఈశ్వరప్ప సై ● నేడు ప్రధాని సభకు రానన్న మాజీ మంత్రి.. ● ఫలించని కేంద్రనేతల రాయబారం



మీడియాతో ఈశ్వరప్ప

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీలో ఒక్కసారిగా అల్లకల్లోలం చోటు చేసుకుంది. పార్టీ సీనియర్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప కుమారుడికి టికెట్ దక్కకపోవడంతో ఆయన రెబెల్‌గా మారారు. అభ్యర్థుల జాబితా ప్రకటించినప్పటి నుంచి ఈశ్వరప్ప రాష్ట్ర పార్టీ నేతలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కుమారుడు కాంతేశ్‌కు టికెట్ దక్కకపోవడానికి యడియూరప్ప, ఆయన కుమారుడు రాష్ట్ర పార్టీ అ ధ్యక్షుడు విజయేంద్ర కారణమని నేరుగా ఆరోపణ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం, మరోవైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన వేళ ఈశ్వరప్ప వివాదం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. ఇదే తరుణంలోనే సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ శివమొగ్గలో ప్రచారసభలో పాల్గొంటున్న తరుణంలో ఆయన తిరుగుబావుటా ఎగురవేయడం చర్చనీయాంశమయ్యింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ రాధామోహన్ అగర్వాల్, రాష్ట్ర పార్టీ సంఘటనా కార్యదర్శి రాజేశ్, ఎమ్మెల్సీ అరుణ్‌లు ఆదివారం నేరుగా ఈశ్వరప్పతో చర్చలకు వెళ్లారు. ఇదే సందర్భంలో కుమారుడికి టికెట్ దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అతిథులుగా వచ్చారంటూ కాఫీ ఇచ్చి ఇంట్లోనే కూర్చోబెట్టి సమీపంలోనే ఓ ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్లారు. ఎంతసేపటికీ ఈశ్వరప్ప స్పందించకపోవడంతో వారు చేసేదిలేక వెనుదిరిగారు. మధ్యాహ్నం ఈశ్వరప్ప మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి సభకు హాజరయ్యేది లేదని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు. ఇలా మాట్లాడుతుండగానే ఆయనకు పార్టీ అధిష్టానం నుంచి ప్రత్యేకమైన ఫోన్‌కాల్ వచ్చింది. ప్రధానమంత్రి శివమొగ్గ పర్యటన నేపథ్యంలోనే ఈశ్వరప్ప ఇంటికి వస్తారనే ప్రచారం సాగుతోంది. కాగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ధారవాడలో మీడియాతో మాట్లాడుతూ ఈశ్వరప్ప అంశం పార్టీ అధిష్టానం పెద్దలు చూసుకుంటారన్నారు. మాజీ జాతీయ ప్రధాన ప్రధాన కార్యదర్శి సీటీ రవి స్పందిస్తూ ఈశ్వరప్ప మరింత ముందుకెళ్లకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇక శివమొగ్గలోనే ఉన్న సీనియర్ నేత యడియూరప్ప స్పందిస్తూ కాంతేశ్‌కు టికెట్ రాకపోవడానికి తాను కారణం కాదన్నారు. నాపట్ల ఈశ్వరప్ప ఆగ్రహంతో ఉన్నారని, అంతకుమించి మాట్లాడేది లేదన్నారు. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయన్నారు. ఒకవేళ ఈశ్వరప్ప సోమవారం రాజీ కాని పక్షంలో శివమొగ్గ రాజకీయం మరింత మలుపులు తిరగనుంది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆనంద్‌గురూజీ, సత్యజిత్ సూరత్కల్‌తోపాటు కురుబసంఘం ప్రతినిధులు బహిరంగంగా ఈశ్వరప్పకు మద్దతు ప్రకటించారు.

స్వామీజీల చుట్టూ బీజేపీ అభ్యర్థులు

● ఆశీర్వాదాలు తీసుకుని బరిలోకి దిగుతున్న కమల నేతలు



నిర్మలానందనాథస్వామీజీ ఆశీస్సులు పొందుతున్న యదువీర్

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అభ్యర్థులుగా ఖరారైన పలువురు స్వామీజీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మైసూరు అభ్యర్థి యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ ఆదివారం మండ్య జిల్లా నాగమంగలలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. కాలభైరవేశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు. యదువీర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం లభించింది. మఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీ స్వయంగా స్వాగతించారు. సుదీర్ఘసమయంపాటు మఠంలో యదువీర్ గడిపారు. ఈ సందర్భంగా మైసూరులో విజయానికి తమవంతు సహకారం కావాలని యదువీర్ కోరినట్లు సమాచారం. ఇక తుమకూరు అభ్యర్థి సోమణ్ణ ఆదిచుంచనగిరి మఠానికి వెళ్లి నిర్మలానందనాథస్వామీజీ ఆశీస్సులు పొందారు. అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే సోమణ్ణ తుమకూరు సిద్దగంగామఠానికి వెళ్లి స్వామీజీ ఆశీస్సులు పొందారు. ఇదే తరహాలోనే పలువురు అభ్యర్థులు సమీపంలో ఉండే మఠాలకు వెళ్లి స్వామీజీల ఆశీస్సులు పొందారు.

సొంతూళ్లకు వెళదాం... ఏపీని సంరక్షించుకుందాం



సొంపల్లి శ్రీకాంత్

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు కేవలం 54 రోజులు మాత్రమే ఉందని సొంతూళ్లకు వెళ్లి ఏపీని రక్షించుకుందామని ఐటీడీపీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొంపల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్ వెనుకబాటును చూశామని, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రవాసాంధ్రులపై ఉందన్నారు. బెంగళూరుతోపాటు కర్ణాటకలో వ్యాపార, ఉద్యోగాలలో స్థిరపడిన వారంతా సొంతూళ్లకు వెళ్లి తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేద్దామన్నారు. ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభం కావాలన్నారు. మిత్రులు, బంధువుల ద్వారా సొంతప్రాంతాలలో పర్యటించి ఆంధ్రప్రదేశ్ వెనుకబడేందుకు గల కారణాలను, వైసీపీ అరాచకాలను వివరించాలన్నారు. కర్ణాటక వాసులేకాకుండా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నివసించేవారంతా సొంతూళ్లకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

యడియూరప్పపైనే కాదు... 52 మందిపై కేసులు పెట్టిన మహిళ

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఫిర్యాదు చేసిన మహిళ ఇప్పటివరకు 52మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. అత్యాచారం కేసులో అన్యాయానికి గురయ్యామని, సాయం కోరుతూ ఫిబ్రవరి 2న యడియూరప్ప నివాసానికి 17ఏళ్ల కుమార్తెతోపాటు తల్లి వెళ్లారు. నగర పోలీస్ కమిషనర్‌కు యడియూరప్ప ఫోన్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సూచించారు. అయితే నెలన్నర తర్వాత యడియూరప్పపై సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 53ఏళ్ల మహిళ తరచూ రాజకీయనాయకులు, సీనియర్ అధికారులను కలుస్తుంటారని, వారితో ఫొటోలు వీడియోలు తీసుకుంటారని ఆ తర్వాత వారిపైనే కేసులు పెడుతుంటారని ఓ పోలీసు అధికారి అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ ఉగ్రప్ప, మాజీ పోలీస్ కమిషనర్ భాస్కర్‌రావు, అలోక్‌కుమార్‌తోపాటు 52మందిపై ఫిర్యాదులు చేశారన్నారు. ఆమె భర్త ఇరుగుపొరుగువారితోపాటు అపార్ట్‌మెంట్ పర్యవేక్షణా కమిటీ సభ్యులతో కలసి పలువురిపై పోలీస్ కమిషనరేట్, డీజీపీ కార్యాలయంలోనూ ఆమె ఫిర్యాదులు చేశారు. 2020 జూన్ 27న మాజీ ఎంపీ ఉగ్రప్పను ఆమె కలిశారు. భర్తపై దాడి జరిగిందని, న్యాయం చేయాలని కోరి ఆ తర్వాత స్త్రీ శిశు సంక్షేమశాఖ ముఖ్యులకు ఫిర్యాదు చేశారు.

పార్టీలు సహకరించాలి..

● ఎన్నికల వేళ నిబంధనలు ఉల్లంఘించరాదు ● ప్రజాప్రతినిధులకు ఎన్నికల కమిషనర్ సూచన



వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంలో నిబంధనలు ఉల్లంఘించరాదని, శాంతియుతంగా కొనసాగేందుకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్) మనోజ్‌కుమార్ మీనా సూచించారు. ఆదివారం రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిపారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ప్రచారంలో ఇతరులను దూషించేలా వ్యాఖ్యలు చేయరాదని, రెచ్చగొట్టే ప్రసంగాలు తగదని సూచించారు. పోలింగ్ కేంద్రాల ఏజెంట్‌లకు ఓటు హక్కును పరిశీలించాలన్నారు. ఓటరు సమాచారాన్ని సమగ్రంగా అవగాహన పొందాలన్నారు. నివాసాలు మారినా, ఇతరత్రా సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ఓటర్ల సమస్యలను ఇప్పుడే పరిష్కరిస్తే పోలింగ్ రోజున ఇబ్బంది ఉండదన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కమిషన్ సాంకేతికతకు అనుగుణంగా కొన్ని యాప్‌లను అభివృద్ధి చేస్తోందన్నారు. ఇందులో ఓటరు హెల్ప్‌లైన్ ఓటర్లకు అనుకూలం కానుందన్నారు. ఓటును ఎక్కడనుంచైనా పరిశీలించుకునే వెసలుబాటు ఉంటుందన్నారు. చిరునామా మార్పును చేసుకోవచ్చునన్నారు. ఎన్నికల అక్రమాలను అరికట్టేందుకు 'సీ' విజిల్ యాప్ కీలకమైందన్నారు. ప్రజలు ఎవరైనా ఈ యాప్ ద్వారా అక్రమాలపై సమాచారం అందించవచ్చునన్నారు. ఫిర్యాదుదారుల అంశం గోప్యంగా ఉంటాయన్నారు. కాగా దివ్యాంగుల కోసం సక్షం యాప్‌ను అభివృద్ధి చేశామన్నారు. వారికి అవసరమైన వాహనం లేదా ఇతర సౌలభ్యాన్ని యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చునన్నారు. ఓటరు హెల్ప్‌లైన్ కోసం 1950 కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చునన్నారు. సువిధ యాప్ ద్వారా అభ్యర్థుల నామినేషన్, అనుమతులకు అవసరమైన వివరాలను తెలుసుకోవచ్చునన్నారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా సేవలు పొందవచ్చునన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లోనూ అందుబాటులో ఉంటుందన్నారు. ఒకసారి లాగిన్ అయితే అభ్యర్థులు తమ నామినేషన్, అనుమతులను తెలుసుకోవచ్చునన్నారు. ప్రచారం కోసం అవసరమైన అనుమతుల జాబితాను సందర్శించవచ్చన్నారు. అనుమతులకోసం దరఖాస్తు పొజిషన్‌ను ట్రాక్ చేసుకోవచ్చునన్నారు. అనుమతుల ఫారంలను డౌన్‌లోడ్, ఆన్‌లైన్‌లో సమర్పించే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు నామినేషన్ వివరాలను ట్రాక్ చేసుకోవచ్చునన్నారు. అప్లికేషన్ స్థితిని ట్రాక్ చేసేందుకు వేదికగా ఉంటుందన్నారు. అభ్యర్థుల సమయాన్ని వృథా కాకుండా చూడడంతోపాటు సమగ్ర సమాచారాన్ని అందిస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, బాధ్యత పెంపొందించేలా సహకారిగా ఉంటుందన్నారు.

మీ అభ్యర్థి ఎవరో తెలుసుకోండి

నో యువర్ క్యాండిడేట్ యాప్ ద్వారా మీ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు, వారి పూర్వాపరాలు, కేసులు, ఇతరత్రా సమాచారాన్ని తెలుసుకోవచ్చునన్నారు. అభ్యర్థి కేవైసీ అప్లికేషన్‌ద్వారా సమగ్రంగా తె లుసుకుని ఎవరికి ఓటు వేయాలనేది నిర్ధారించుకోవచ్చునన్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సమావేశంలో అడిషినల్ చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్‌లు వెంకటేశ్ కుమార్, కూర్మారావ్ తదితరులు పాల్గొన్నారు.



రాచనగరిలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో..?



● యతీంద్రను బరిలోకి దింపేందుకు సిద్దు ససేమిరా ● అభ్యర్థి కోసం మల్లగుల్లాలు

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మైసూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా యువరాజు యదువీర్ ఖరారు కావడంతో ప్రత్యర్థిగా కాంగ్రెస్ నుంచి ఎవరిని బరిలోకి దింపాలి అన్న విషయంపై అగ్రనేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. మైసూరు అభ్యర్థిని గెలిపించడం సీఎం సిద్దరామయ్యకు సవాల్‌గా మారుతోంది. పదేళ్లకాలంగా బీజేపీ ఎంపీగా ప్రతాప్ సింహ కొనసాగారు. 2019లో కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలోనూ ప్రతాప్‌సింహ గెలుపొందారు. ఆయనకంటే మెరుగైన వ్యక్తి అని బీజేపీ ఈసారి యదువీర్‌ను అభ్యర్థి చేసింది. రాజవంశీయుడైన యదువీర్‌కు దీటైన అభ్యర్థిని ఎంపిక చేయలేక సతమతమవుతున్నారు. సీఎం సిద్దరామయ్య సొంత జిల్లా, సొంత పట్టణం కావడంతో మైసూరులో ఆయన ప్రాబల్యం ఉంది. యదువీర్‌ను ఓడించేంతటి అభ్యర్థి ఎవరనేది ఇంకా తేల్చలేదు. సీఎం సిద్దరామయ్య కుమారుడు యతీంద్రను బరిలోకి దించాలని పార్టీ వర్గాలు కొందరు ప్రస్తావిస్తున్నా సిద్దరామయ్య ససేమిరా అంటున్నారు. ఒకవేళ యతీంద్ర ఓడితే సిద్దరామయ్య ముఖ్యమంత్రి పదవిపైనా పెను ప్రభావం చూపుతుందని ఆయన వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. సొంతూరులో కన్న కుమారుడిని గెలిపించుకోకపోతే పార్టీ వర్గాలు, ప్రత్యర్థుల నుంచి తీవ్రమైన విమర్శలు ఎదుర్కొనాల్సి వస్తుందని ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లో అనాదిగా అవకాశవాద గ్రూప్ రాజకీయాలు కొనసాగుతూనే ఉన్నాయి. సొంతపార్టీకి చెందినవారినుంచే ఓడానని, గతంలో ఎంతోమంది ప్రముఖ నేతలు ప్రస్తావించిన విషయం తెలిసిందే. యతీంద్ర పరిస్థితి కూడా అదే కానుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పార్టీ అధికార ప్రతినిధి లక్ష్మణ్‌కు టికెట్ ఇచ్చి చేతులు దులుపుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.73	1,596.22
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,692	9,226
సామర్థ్యం (టీఎంసీలు)	5.93	17.02

అధ్వానంగా బైపాస్ రోడ్డు



అధ్వానస్థితిలో సోనియా గాంధీ బైపాస్ రోడ్డు

సిరుగుప్ప, మార్చి 17: సోనియాగాంధీ బైపాస్ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సిరుగుప్ప పట్టణ పరిధిలో సోనియా గాంధీ బైపాస్ రోడ్డు పనులను గత యేడాది రూ. 88 లక్షల నిధులతో చేపట్టారు. ఈ మార్గంలో అధిక లోడు గల వాహనాలు సంచరిస్తుండటంతో సీసీ రోడ్డు గుంతలు పడి కంకరతేలి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తోంది. నగరసభ సభ్యులు దీనిపై దృష్టిసారించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బూత్‌స్థాయి నుంచి కేఆర్‌పీ బలోపేతం



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

సిరుగుప్ప, మార్చి 17: కేఆర్‌పీ పార్టీ బలోపేతం కోసం బూత్‌స్థాయి నుంచి పాటుపడాలని ఆ పార్టీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ధరప్ప నాయక అన్నారు. సిరుగుప్ప పట్టణంలో ఆదివారం కేఆర్‌పీ పార్టీ కార్యాలయంలో బూత్ స్థాయి పదాధికారులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కేఆర్‌పీపీ రాష్ట్ర అధ్యక్షుడు గాలి జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు బూత్‌స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేఆర్‌పీపీ జిల్లా కార్యదర్శి బంద్రాళ్ మల్లికార్జున, తాలుకా ప్రధాన కార్యదర్శి వన్నూరువలీ, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మహమ్మద్, కార్మిక శాఖ పదాధికారులు ఇర్ఫాన్, షేక్ రెహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నియంత్రణకు కృషి చేయాలి



మారథాన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బళ్లారి గాంధీనగర్, మార్చి 17: క్షయవ్యాధి ప్రాణాంతకం కాదని, సరైన సమయంలో వైద్యం పొందితే ప్రాణాపాయం నుండి బయట పడవచ్చని జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేష్ బాబు పేర్కొన్నారు. క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, విజయనగర వైద్యకీయ విజ్ఞాన సంస్థ, జాతీయ క్షయరోగ నిర్మూలనా విభాగం, విమ్స్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో ఐదు కిలోమీటర్ల మారథాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఒకసారి క్షయవ్యాధి లక్షణాలు కనిపిస్తే చికిత్స ముగిసే వరకు వైద్యుల పర్యవేక్షణ ఉంటుండ్నారు. ఒకవేళ ఇంటిలో చిన్న పిల్లలకు క్షయవ్యాధి లక్షణాలు ఉంటే అలాంటి పిల్లలను బయటకు పంపకుండా వెంటనే వైద్యం ఇప్పించాలన్నారు. ఈ దిశగా వైద్య విద్యార్థులు ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం జిల్లా సర్జన్ బసరెడ్డి మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడాలన్నారు. ఇదే సందర్భంగా మారథాన్‌లో గెలుపొందిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విమ్స్ వైద్య నిపుణులు డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ రఘువీర, డాక్టర్ అనిల్ కుమార్, జోసెఫ్ జిల్లా ఆరోగ్య విద్యాశాఖ అధికారి ఈశ్వర్ దానప్పనవర్, వైద్య విద్యార్థి సంఘం డాక్టర్ లోకేష్ డాక్టర్ గౌరి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి, మార్చి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తామని బళ్లారి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా చెప్పారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులతో పాటు లోక్‌సభ పరిధిలో మొత్తం 35 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆదివారం కలెక్టర్ సమావేశ భవన్‌లో డీ.సీ విలేకరుల సమావేశం నిర్వహించారు. బళ్లారి లోక్‌సభ పరిధిలో మొత్తం 18,65,341 ఓట్లు ఉన్నాయన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 9,45,053 మంది, పురుషులు 9,20,022 మంది, ఇతరులు 266 మంది ఉన్నట్లు తెలిపారు. మే 7న పోలింగ్, జూన్ 4 న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. 16 మార్చి 2024 నుంచి కోడ్ అమల్లో ఉన్నట్లు తెలిపారు. జూన్ 6న మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు.
బళ్లారి లోక్‌సభ పరిధిలో మొత్తం 8 శాసనసభ నియోజక వర్గాలు ఉన్నాయన్నారు. ఇందులో 4 నియోజక వర్గాలు కంప్లి, సండూరు, కూడ్లిగి, బళ్లారి గ్రామీణ నియోజక వర్గాలు ఎస్టీలకు రిజర్వు కాగా 2 నియోజక వర్గాలు ఎస్సీ వర్గాలకు రిజర్వు చేశారన్నారు.

35 చెక్‌పోస్టుల ఏర్పాటు

బళ్లారి లోక్‌సభ పరిధిలో మొత్తం 35 వివిధ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే అంత రాష్ట్రాల సరిహద్దులో 13 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ముగ్గురు సిబ్బంది పనిచేస్తారని రోజుకు మూడు షిఫ్టులు ఉంటాయన్నారు. 167 మంది సెక్టార్ ఆఫీసర్లు, 26 మంది ఎఫ్‌ఎస్‌టీ టీంలు, 30 ఎస్ఎస్‌టీంలు, 8 వీవీఈలు 18 వీఎస్‌టీంలు 10 ఎన్నికల వ్యయ పరిశీలకులు, 8 అకౌంటింగ్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ బూతుల్లో విధులు నిర్వహించేందుకు 1409 మంది పీఆర్వోలు, 2172 మంది ఏపీఆర్వోలు, 4344 మంది పీఓలతో సహా మొత్తం 9474 మందిని ఎన్నికల నిర్వహించేందుకు వినియోగిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల అధికారులు చురుగ్గా పనిచేయాలి

బళ్లారి సిటీ, మార్చి 17: ఎన్నికల విధి నిర్వహణ కోసం కేటాయించిన అధికారులు సిబ్బంది చురుగ్గా పనిచేయాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలియజేశారు. లోకసభ సార్వత్రిక ఎన్నికల ప్రకటన నేపథ్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం హాల్లో ఎన్నికల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్ ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, 24 గంటల్లో ఖచ్చితమైన అమలు కోసం మూడు వేర్వేరు భాగాలుగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల బ్యానర్లు, ప్లెక్సీలు, తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అతిథి గృహాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు అనుమతించరాదని సూచించారు. హెల్ప్‌లైన్ నంబర్ 1950కు మరింత ప్రచారం కల్పించాలని ఆయన అన్నారు. జిల్లాస్వీప్ కమిటీ నోడల్ అధికారి జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప, పోలీసు కమిషనర్ రంజిత్‌కుమార్ బండారు పాల్గొన్నారు.

అమలులోకి ఎన్నికల కోడ్: డీసీ



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో డీసీ సమావేశం

బళ్లారి సిటీ, మార్చి 17: జిల్లాలో మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ శనివారం నుంచి అమలులోకి వచ్చిందని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. బహిరంగ సభలు, వేడుకలు ర్యాలీలు, మొబైల్ వాహనాలు, లౌడ్‌స్పీకర్లు, హెలికాప్టర్లు, హెలిప్యాడ్‌ల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 12నుండి నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని, ఏప్రిల్ 20న నామినేషన్ పత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. 22న నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చన్నారు. మే 7న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో తమ పార్టీ లోగో లను ఫ్లెక్సీలను ఇతర రాజకీయాలకు సంబంధిచిన బ్యానర్లను స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. ఎలాంటి ర్యాలీలు నిర్వహించాలన్నా, రాజకీయ పార్టీ సమావేశాలు నిర్వహించాలన్నా, అనుమతి తీసుకోవాలన్నారు. మతపరమైన సంస్థలు, స్థలాలను, 18 ఏళ్లలోపు పిల్లలను ప్రచారంలో ఉపయోగించుకూడదన్నారు. పెళ్ళిల్లు సమావేశాలు, వేడుకల్లో ఓట్ల ప్రచారం చేయరాదన్నారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగానికి అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాస్వీప్ నోడల్ అధికారి, జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప, జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎల్సీ ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలి



సమావేశానికి హాజరైన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు

బళ్లారి గాంధీనగర్, మార్చి 17: జిల్లాలో ఎస్ఎల్ఎల్సీ ఫలితాల శాతాన్ని పెంచడంతో పాటు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పాటించేలా విద్యాశాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఎస్ఎస్ఎల్సీ ఫలితాలో ఉత్తమ స్థానం పొందేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లాధికారి సభాంగణంలో విద్యాశాఖ అధికారుల సమావేశంలో పది పరీక్షల నిర్వహణపై చర్చలు జరిపారు. క్షేత్ర విద్యాశాఖ అధికారులు, క్షేత సమన్వయాధికారులు, సిఆర్‌పిలు పరీక్షా కేంద్రాలను సందర్శించి విద్యుత్ సౌకర్యంతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వ్యాప్తిలో ఆయా తాలూకా తాహసీల్దారులు ఖచ్చితంగా పరీక్షా కేంద్రాలను సందర్శించాలని సూచించారు. ఎస్ఎస్ఎల్సి పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం అవరమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో ఎండవేడిమి ఎక్కువగా ఉందని, ప్రతి పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వ్యవస్థను కల్పించాలని, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన డెస్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా పంచాయతీ సిఇఓ శరణప్ప సంకనూరు మాట్లాడుతూ హైస్కూలు విద్యలో ఎస్ఎస్ఎల్సీ పరీక్షలు ప్రధానమైనవని, కేంద్ర స్థానం నుంచి దూరంగా ఉన్న ప్రాంతాలకు ట్రెజరీ నుంచి అరగంట ముందుగానే ప్రశ్నపత్రాలు చేరేలా చూడాలన్నారు. పరీక్షలు జరిగేకేంద్రాల్లో విద్యుత్ వవ్యస్థ ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో 310 పదవ తరగతి పాఠశాలలు ఉండగా, 10,234 మంది బాలురు, 10,617 మంది బాలికలు, మొత్తం 20,851 మంది విద్యార్థులు ఈ సారి పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇందుకుగాను జిల్లాలో 61 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో నాలుగు సూక్ష్మ, 14 అతిసూక్ష్మ పరీక్షా కేంద్రాలుగా, 43 సామాన్య కేంద్రాలుగా గుర్తించినట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మహ్మమ్మద్ జుబేర్, డయిట్ ప్రిన్సిపాల్ హనుమక్క, సార్వజనిక విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.కె. సత్యనారాయణలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బళ్లారి ఏపీఎంసీ అధ్యక్షుడిగా కట్టిమనె నాగేంద్ర



బళ్లారి సిటీ, మార్చి 17: బళ్లారి వ్యవసాయోత్పత్తుల మార్కెట్(ఏపీఎంసీ) ఛైర్మన్‌గా కట్టిమనె నాగేంద్రను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ జిల్లాఇన్‌ఛార్జిమంత్రి బి.నాగేంద్ర, నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి తదితర పార్టీల నేతల సహకారంతో ఈ పదవి ఇచ్చారన్నారు. రైతుల శ్రేయస్సు కోసం కమిటీ కృషి చేస్తుందన్నారు. తనతో పాటు ఉపాధ్యక్షులుగా హాలియప్ప, కమిటీ సభ్యులుగా హస్తపంపనగౌడ జాళిహాల్, మల్లికార్జునగౌడ, హాలకుంది ముండాలప్ప, విశ్వనాథ్ నాయక్, కుడాన్ సాబ్, అక్కి నాగరత్నమ్మ, గవిసిద్దనగౌడ, కన్యానాయక్, యల్లప్ప నియమితులయ్యారని తెలిపారు.

సోషల్ మీడియా సహ సంచాలకుడిగా గణేష్



గణేష్‌కు సోషల్ మీడియా సహ సంచాలకుడిగా పత్రం ఇస్తున్న దృశ్యం

కంప్లి, మార్చి 17: కుడితిని పట్టణానికి చెందిన గణేష్‌ను బీజేపీ జిల్లా సోషల్ మీడియా సహసంచాలకుడిగా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా నియమించారు.. గతంలో బీజేపీకి ఆయన చేసిన సేవలు గుర్తించి ఆయనను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి ఐటీ సెల్ పదాధికారులుగా ఎన్నుకున్నందుకు సంతోషిస్తున్నామన్నారు. లోకసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు, కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతీప్రసాద్, సోమశేఖర్‌గౌడ, రాజు, అభిలాష్ నాయుడు, మల్లికార్జున, నవీన్, ప్రమోద్, రాకేష్ పాల్గొన్నారు.

పునీత్ రాజ్‌కుమార్ సేవలు మరువలేనివి



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

కంప్లి, మార్చి 17: రాష్ట్రంతో పాటు దేశంలోనే ఇతర రంగంలో పేరుగాంచిన కన్నడ చిత్రనట పునిత్ రాజ్‌కుమార్ చేసిన సేవలు మరువలేనివని పునిత్ రాజ్‌కుమార్ అభిమానులసంఘం పదాధికారులు తెలిపారు. ఆయన 49వ జన్మదినం సందర్భంగా కంప్లి పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుబాగంలో ఆయన నామఫలకం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఆయన చిన్నతనం నుంచే రాష్ట్రంలో పేద కుటుంబాలను గుర్తించి విద్యాభ్యాసానికి, ఆరోగ్యానికి అనేక మందికి సాయం అందించారన్నారు. ఆయన చేసిన సేవలు ఎన్నడూ మరువలేమన్నారు. ఆయన తమతో లేకపోవడంతో విషాదకరమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు రామచంద్ర, ప్రధాన కార్యదర్శి నీలప్ప పెయింటర్, ఉపాధ్యక్షులు సోఫియాసాబ్, శ్రీనివాస్, వెంకటేష్, జిలాన్, వసంత్, రాజా, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడండి- రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, మార్చి 17: రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని, కర్ణాటక రాష్ట్ర ఉపాధ్యాయుల వేదిక జిల్లా అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి తెలిపారు. నగరంలోని పెద్దమార్కెట్‌లో ఆదివారం అఖిల కర్ణాటక యువ అయ్యప్పసేవా సమితి, స్వామి వివేకానంద రక్తబండారం సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని 28సారి స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ, పునీత్ నటునిగా మాత్రమే కాక సమాజసేవలో ఎనలేని సేవలు చేశారన్నారు. ఈసందర్భంగా మహానగర పాలిక సభ్యుడు గుడిగంట హనుమంతప్ప, నగర ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షులు హండేకర్ రాజేశ్, అప్పు(పునీత్‌రాజ్‌కుమార్) యువకులు రక్తదానం చేశారు. సేవాసమితి అధ్యక్షులు మంజునాథ్, సభ్యులైన చంద్రశేఖర్, మిథున్, మధు, రాము, బసవ, యశోధర, హొన్నూర్, గాది, సురేశ్ పాల్గొన్నారు.



రవిచెళ్లగుర్కికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న సేవా సమితి

చెక్‌పోస్టు వద్ద తహసీల్దార్ ముమ్మర తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కంప్లి, మార్చి 17 : లోక్‌సభ ఎన్నికలు ఖరారు కావడంతో అధికారుల ఆదేశాల మేరకు చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో కంప్లి కోట వద్ద, ఉప్పర్లి వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. ఆదివారం ఉదయం కొప్పాళ జిల్లా గంగావతి వైపు నుంచి వస్తున్న వాహనాలను తహసీల్దార్ శివరాజ్ వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బు, బంగారం ఇతర సామాగ్రిని తీసుకెళ్లినట్లయితే వాటిని స్వాధీనంపరచుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికలు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ ప్రకాష్ మాళిగి మాట్లాడుతూ తమ సిబ్బంది తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ కమిటీ అధ్యక్షుడు



ఏపీఎంసీ మార్కెట్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అంజినప్ప

కంప్లి, మార్చి 17: నూతనంగా ఏపీఎంసీ మార్కెట్ అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా నియమితులైన దేవలాపురం అంజినప్ప, ఇటిగి శరణబసవ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అనుగుణంగా మార్కెట్‌ను అభివృద్ధి చేసి ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దాలని కోరారు. అధ్యక్ష ,ఉపాధ్యక్షులు కూడా ఎమ్మెల్యే తమపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. వారితో పాటు కార్యదర్శి రాజు కొంచిగేరి, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

హొసూరు జోన్

అలరించిన ఎస్పీ స్మారక సంగీత విభావరి



కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు భాషాభిమానులు

హొసూరు, మార్చి 17: హొసూరు కామరాజ్ కాలనీలోనిఆంధ్రసాంస్కృతిక సమితిలో ఆదివారం ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి, ఎస్పీ బాలసుబ్రమణ్యం స్మారక స్వరాభిషేకం పేరిట నిర్వహించిన సంగీత విభావరి సభికులను అలరించింది. ఆదివారం సాయంత్రం మిత్ర బృందం అధ్యక్షులు కాంసింగ్ నేతృత్వంలో ఏర్పాటైన కార్యక్రమాన్ని హొసూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య ముఖ్యఅతిథిగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన చంద్రతేజ, మహాలక్ష్మి, స్థానిక గాయని గాయిత్రి ఎస్‌టీ రాజు, జానకీరామ్ నాగభూషణం, మునిరాజు తదితర కళాబృందం పాల్గొని ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం పాటలను ఆలపించారు. మురళీ కార్తీక్, మురుగేశ్, హరిశంకర్‌ల వాద్యబృందాలు సహకారం అందించారు. స్థానిక ప్రముఖులు, తెలుగు భాషాభిమానులు ముత్తుకృష్ణన్, భవానిసింగ్, ఎంఎస్ రామస్వామిరెడ్డి, గోపాల్, ప్రభాకరశాస్త్రి, పెద్దసంఖ్యలో సంగీతాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వరుస హత్యలతో ప్రజల్లో భయాందోళన

హొసూరు(క్రైం), మార్చి 17: హొసూరు ప్రాంతంలో వరుస హత్యలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం హొసూరు సమీపంలో డీఎంకే యూత్ ఆర్గనైజర్ కార్తీక్‌ను కారులో వచ్చిన దుండగులు నరికి చంపేశారు. కాగా బేర్కై సమీపంలోని క్వారీలో ఓ మహిళ శవమై కనిపించింది. ఆమె భర్త అనుమానంతో ఉండేవాడని అతడే తన భార్యను హతమార్చి ఉంటాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అతడు భార్యను హతమార్చి క్వారీలో పడేసి పరారైయ్యాడని తెలుస్తోంది. ఈ ఘటన కేసు ముగియక ముందే బాగలూరు సమీపంలోని సరస్సులో 16 ఏళ్ల విద్యార్థిని మృతదేహాన్ని గుర్తించారు. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అంతటితో ఆగకుండా హొసూరు సిప్‌కాట్‌లోని గోవింద అగ్రహారం ప్రాంతంలోని మురుగు కాల్వలో ఓ యువతి కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. 24 గంటలలోపే హొసూరులో రెండు హత్యలు, రెండు అనుమానాస్పద మరణాలు చోటు చేసుకోవడం స్థానికుల్లో కలవరం కలిగిస్తోంది.

ఉత్సాహంగా అక్షరాస్యతా పరీక్షలు

హొసూరు, మార్చి 17: హొసూరు కార్పొరేషన్‌లోని బేడరపల్లిలో ఆదివారం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్ (ఎన్ఐఎల్‌పీ) పరీక్షలు ఉత్సాహంగా సాగాయి. 15-35 ఏళ్లలోపు వారిలో అక్షరాస్యతను పెంపొందించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం సాగుతోంది. హొసూరు యూనియన్ మునిసిపల్ కార్పొరేషన్ మిడిల్‌స్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ప్రాథమిక అక్షరాస్యత పరీక్షల్లో 15 మంది పాల్గొన్నారు. సుమారు రెండు గంటలపాటు సాగిన పరీక్షల్లో నిరక్షరాస్యులతోపాటు 18 ఏళ్లపైబడిన వారు పాల్గొన్నారు. కాగా కార్పొరేషన్ మిడిల్ స్కూల్‌లో జరిగిన ప్రాథమిక పరీక్షల్లో ప్రధానోపాధ్యాయుడు పొన్నాగేశ్, స్కూల్ మేనేజిమెంట్ కమిటీ ఛైర్మెన్ మంజుళ, దివ్య అనే వాలంటీర్ పాల్గొన్నారు.



బేడరపల్లిలో పాల్గొన్న పరీక్షార్థులు

రాయచూరు లోక్‌సభ అభ్యర్థులపై వీడని ఉత్కంఠ

●బీజేపీలో ఇద్దరు, కాంగ్రెస్‌లో ముగ్గురు ఆశావహులు



బీజేపీ టిక్కెట్ రేసులో బీవీ నాయక్, అమరేశ్వర్ నాయక్

రాయచూరు, మార్చి 17 : లోకసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఇప్పటికే షెడ్యూల్ జారీ చేయగా రాయచూరు స్థానం నుంచి బరిలో దిగే అభ్యర్థులపై స్పష్టత కరువైంది. ముఖ్యంగా జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల మధ్య ప్రధాన పోటీ ఉండగా ఈ రెండు పార్టీల నుంచి కూడా ఇప్పటికి అభ్యర్థిని ప్రకటించలేదు. కేంద్రంలో తిరిగి నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్న నమ్మకం ఆ పార్టీలో నెలకొన్న వేళ బీజేపీ నుంచి ముగ్గురు అభ్యర్థులు టికెట్ కోసం పోటీ పడుతుండడం గమనార్హం. పార్టీ ఇప్పటికే నిర్వహించిన అంతర్గత సర్వేలో సిటింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ పట్ల కొంత వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఆయనకు మరో సారి టికెట్ దక్కడం అనుమానమేనని పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో మాజీ ఎంపీ బీవీ నాయక్ బీజేపీ టికెట్ కోసం గట్టి ప్రయత్నాలే ప్రారంభించారు. సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్,మాజీ ఎంపీ బీవీ నాయక్‌ల మధ్య బీజేపీలో టికెట్ పోటీ నెలకొన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉండడం గమనార్హం. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉండడంతో పాటు ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు ఉంటుందని విశ్వసిస్తున్న వారు పోటీ కోసం ఉవ్విళ్లూరుతున్నారు. రాయచూరు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ కుమార్ నాయక్ తనవంతు ప్రయత్నాలు ప్రారంభించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో మంత్రి సతీశ్ జారకిహోళి అల్లుడు రవి పాటీల్ పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో పాటే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గెకు సన్నిహిత మిత్రుడుగా పేరున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయవాది దేవణ్ణనాయక్ కూడా రేసులో ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో రాయచూరు స్థానంపై ప్రధాన పార్టీలు కీలకంగా దృష్టి సారించినట్లు తెలిసింది. జేడీఎస్ అభ్యర్థి బరిలో ఉండకపోవడంతో ప్రధాన పోటీ బీజేపీ-కాంగ్రెస్‌ల మధ్యనే కొనసాగనుంది.



కాంగ్రెస్ ఆశావహులు రవి పాటిల్, జీ కుమార్ నాయక్, దేవణ్ణ నాయక్

నగరసభకు నలుగురు నామినేటెడ్ సభ్యుల నియామకం

రాయచూరు, మార్చి 17 : రాయచూరు నగరసభ నామినేటెడ్ పోస్టులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. నగరానికి చెందిన నలుగురిని నగరసభ నామినేటెడ్ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. నామినేటెడ్ సభ్యులైన వారిలో మహ్మద్ ఫెరోజ్ హమ్‌రాజ్, మణికంఠ మునిస్వామి, వెంకటేశ్, అమిత్ కుమార్ లోదాలు ఉన్నారు.



తొడగొడుతున్న యువతి..



పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం



ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు







ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట



ఉత్సాహంగా యువతులు..



బాబు,పవన్, పురందేశ్వరి అభివాదం...



మోదీతో బాబు మాటామంతీ..



జానపదుల నృత్యాలు..



మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..





పునీత్‌కు ఘన నివాళి

శిడ్లఘట్ట, మార్చి 17: పట్టణంలోని చింతామణి రోడ్డులోని పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్‌లో ఉన్న 'కర్ణాటక రత్న' పునీత్‌రాజ్‌కుమార్ 49వ జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. స్నేహబళగ ఆధ్వర్యంలో పునీత్‌రాజ్‌కుమార్ విగ్రహానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. గ్యాస్‌భరత్ నేతృత్వంలో పుష్పాంజలి ఘటించారు. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు అనంతకృష్ణ, వాసవి విద్యాసంస్థ పాలనాధికారి రూపసి రమేశ్ మాట్లాడుతూ పునీత్ చేసిన సామాజిక సేవలతో కన్నడిగుల హృదయాలలో శాశ్వతంగా నిలిచారన్నారు. అత్యంత తక్కువ సమయంలోనే ప్రజాదరణ పొందారన్నారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్నేహబళగ నేతృత్వంలో ప్రముఖులు ఉదయ్, నవీన్, చంద్రు, అశోక్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు సాగాయి.



పునీత్‌రాజ్‌కుమార్‌కు నివాళి అర్పిస్తున్న స్థానిక ప్రముఖులు

విద్య జీవనానికి సోపానం కావాలి

శిడ్లఘట్ట, మార్చి 17: నేర్చుకున్న విద్య జీవనానికి సోపానం కావాలని, వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడాలని డీఎస్పీ కేఎన్ రమేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని శారదా విద్యాసంస్థలో రిటైర్డు ప్రధానోపాధ్యాయురాలు బీఎం విజయమ్మకు పూర్వ విద్యార్థుల సంఘం వీడ్కోలు సందర్భంగా ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్య అనేది కేవలం సర్టిఫికెట్‌కు పరిమితం కారాదన్నారు. గురువులు, పెద్దల పట్ల పూజ్యభావం ఉండాలన్నారు. విద్యకు నైపుణ్యం తోడైతే ఉపాధి, ఉద్యోగం సాధ్యమన్నారు. వాసవి విద్యాసంస్థ పాలనాధికారి రూపసి రమేశ్ మాట్లాడుతూ ఒకసారి నేర్చుకున్న విద్య ఎన్నటికీ మరువలేమన్నారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని అభిప్రాయపడ్డారు. పాఠశాల సంస్థాపక అధ్యక్షుడు మునిరత్నం మాట్లాడుతూ ఇటీవలి ప్రభుత్వాల తీరుతో స్కూళ్లలో పాఠాలు సజావుగా కొనసాగించే పరిస్థితి లేకపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యసాధ్యమన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి స్మార్ట్, లియోక్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు లోకేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

అక్కితం (జయంతి)



మళయాళ కవి, రచయిత, 'పద్మశ్రీ' గ్రహీత అక్కితం అచ్యు తన్ నంబూద్రి 1926 మార్చి 18న కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లా కుమర నెల్లూర్‌లో జన్మించారు. సరళమైన, స్పష్టమైన రచనా శైలికి పేరొం దారు. అత్యు న్నత సాహితీ గౌరవమైన జ్ఞానపీఠ పుర స్కారం తో పాటు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, కేరళ సాహి త్య అకాడమీ అవార్డు, ఒడక్కుజల్ అవార్డు, వల్లతోల్ అవార్డు, వయలార్ అవార్డు, ఓఎన్‌వీ లిటరరీ అవార్డు ఇతర గౌరవాలు పొందారు. 2020 అక్టోబరు 15న కన్నుమూశారు.

దండమూడి రామమోహనరావు (జయంతి)



దండమూడి రామ మోహన రావు 1933 మార్చి 18న కృష్ణా జిల్లా ఉయ్యూరులో జన్మించారు. మృదం గ విద్వాంసులుగా పేరొందారు. ఆరవ యేట కచేరీకి మృ దంగం వాయించి ప్రశంసలు పొందారు. టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా పనిచేశారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో కళాకారుడిగా ఐదు దశాబ్దాల పాటు కొనసాగారు. ఎంతోమంది శిష్యులకు కళను నేర్పించారు. సంగీత నాటక అకాడమీ సహా పలు అవా ర్డులు పొందారు. 2011 జనవరి 11న కన్నుమూశారు.

శశికపూర్ (జయంతి)



పద్మభూషణ్ గ్రహీత శశికపూర్ 1938 మార్చి 18న కోల్కత్తాలో జన్మించారు. అసలు పేరు బల్ బీర్ రాజ్‌కపూర్. ప్రముఖ హిందీ నటు డు పృథ్వీరాజ్ కపూర్ మూడవ కుమారుడు. తండ్రి తో కలసి నాట కాలు, సినిమా లలో నటించారు. క్రమేణా నటుడిగా, దర్శ కుడిగా, నిర్మాతగా రాణించారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్, నాలుగు నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్, రెండు ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్, ఇతర పురస్కారాలు అందు కున్నారు. 2017 డిసెంబరు 4న కన్నుమూశారు.

అరుంధతి భట్టాచార్య (పుట్టినరోజు)



అరుంధతి భట్టాచార్య 1956 మార్చి 18న కోల్కత్తాలో జన్మిం చారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా తొలి ఛైర్‌పర్సన్‌గా వ్యవ హరించిన ఖ్యాతి గడించారు. 2016లో ఫోర్బ్స్ జాబి తాలో ప్రపంచంలో శక్తివంతురా లైన తొలి 25 మంది మహిళల్లో ఒకరుగా నిలిచారు.

విద్యార్థులు పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలని గ్లాస్గో యూనివర్సిటీ ముఖ్యులు డాక్టర్ జూలియన్ లీ కేర్‌నెక్ అభిప్రాయపడ్డారు. బీజీఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై ప్రత్యేకంగా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్, చర్చాగోష్ఠి జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యులుగా పాల్గొన్న డాక్టర్ జూలియన్ మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి విద్యాకోర్సులలో పరిశోధనలు, ప్రయోగాలపట్ల ఆసక్తి చూపాలన్నారు. ఐఐటీ ఇండోర్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ రామబిలాస్ పచోరి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సాంకేతిక విద్యలో విప్లవాత్మక మార్పు వచ్చిందని, సౌలభ్యాలు పెరిగాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మహేంద్ర ప్రశాంత్ మాట్లాడుతూ 1677మంది పరిశోధనా విద్యార్థులు, తాము రూపొందించిన ప్రాజెక్టుల వివరాలు సమర్పించారన్నారు. వాటిలో 291ని సదస్సులో ప్రస్తావించారన్నారు. డాక్టర్ బాబుతోపాటు పలువురు పాల్గొన్నారు. ఆది చుంచనగిరి పీఠాధిపతి నిర్మలానందనాథస్వామిజీ, విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌నాథస్వామిజీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగాయి.



జ్యోతిప్రజ్వలనలో ప్రముఖులు

వాహనాల టైర్ల నాణ్యత ముఖ్యం



కాంటి ఎలైట్ స్టోర్ ప్రారంభంలో ప్రముఖులు

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వాహనాలలో టైర్ల నాణ్యత ముఖ్యమని వాహనం నడిపేవారు, వాటిపట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని కాంటినెంటల్ టైర్స్ ఎండీ సమీర్‌గుప్త అభిప్రాయపడ్డారు. కోరమంగలలో కాంటి ఎలైట్ స్టోర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీర్ గుప్త మాట్లాడుతూ ఇంటింటా వాహనం ఉంటుందని అయితే వాటిపట్ల కనీసమైన పరిజ్ఞానం ముఖ్యమన్నారు. వీల్ బ్యాలెన్సింగ్ అలైన్‌మెంట్, నైట్రోజన్ ఫిల్లింగ్, టైర్ల మార్పు వంటి కీలకమైన సేవలు అందించేందుకు కాంటి ఎలైట్ డ్రైవ్ (సీఈడీ) పేరిట ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. మార్కెట్‌లో మార్కెట్ కోసం అనే నినాదంతో స్టోర్ పనిచేస్తుందన్నారు. చెర్రీ ఏజెన్సీస్ వ్యవస్థాపకుడు రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ కాంటినెంటల్ టైర్స్‌తో వ్యాపార సంబంధం కలిసి ఉన్నామన్నారు. సీఈడీ సెంటర్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

ఓరియన్‌లో మహిళా సాధకులకు సత్కారం

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఓరియన్ మాల్‌లో మహిళా సాధకులను సత్కరించారు. ప్రముఖ నేపథ్యగాయని ఉషా ఉత్తుప్, నటి ప్రియాంక ఉపేంద్రలు నగర పరిధికి చెందిన 44మంది మహిళలను సత్కరించారు. ఇదే సందర్భంగా ఓరియన్ గిఫ్ట్‌కార్డును ఉషా ఉత్తుప్ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో సాధకులైన మహిళలను గౌరవించే సంప్రదాయం బ్రిగేడ్ సహా అన్ని సంస్థలు చేపట్టాలన్నారు. తద్వారా మరింతమందికి స్ఫూర్తినిస్తుందన్నారు. లింగబేధం అనేది సమాజంలో రూపుమాపేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ప్రియాంక ఉపేంద్ర మాట్లాడుతూ మహిళా స్వావలంబన దిశగా కార్యక్రమం జరగడం సంతోషమన్నారు. బ్రిగేడ్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ సునిల్ మున్షీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



ప్రశంసాపత్రం అందజేత

నగరసభ కమిషనర్ బదిలీ

చింతామణి, మార్చి 17: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సూచనతో చింతామణి నగరసభ కమిషనర్ జీఎన్ చలపతిని రాయచూరు నగరసభకు బదిలీ చేస్తూ శనివారం ఆదేశాలు జారీ అయ్యాయి.

ఆధునిక వైద్యం

అందుబాటులోకి తేవడమే లక్ష్యం

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యమని వెయ్యి కోట్ల రూపాయలతో బాణసవాడిలో 500 పడకల సామర్థ్యంతో ప్రపంచస్థాయి ప్రమాణాలతో సక్ర వరల్డ్ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్టు ప్రకటించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో జపాన్‌కు చెందిన టయోటా టిశో, సెకామ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్టు టోట్సురో యాజో ప్రకటించారు. టయోటా టిశో రీజినల్ సీఈఓ హిరోశి యోనెనాగ, బెంగళూరు సక్ర ఆసుపత్రి ఎండీ యువాచి నగోనా, డిప్యూటీ డైరెక్టర్ నోయానా ముత్సుమి, సీఈఓ లవకేశ్ ఫాసు పాల్గొన్నారు. సెకామ్ ఈడీ టోట్సురో ప్యూజ్ మాట్లాడుతూ ప్రస్తుతానికి వెయ్యి కోట్లతో 500 పడకల సామర్థ్యం కల్గిన ఆసుపత్రిని ఆరంభిస్తామని అంచలంచెలుగా వెయ్యి పడకలకు పెంచుతామన్నారు. ఆరోగ్యరంగంలో కొత్త పరిశోధనలు, సాంకేతిక విధానాలు ఆసుపత్రిలో లభిస్తాయన్నారు. బెంగళూరులోనే రెండోశాఖ ఏర్పాటు పట్ల ఇక్కడి కాస్మోపాలిటన్ విధానాలకు అనుగుణంగా నిర్మించదలిచామన్నారు. 2026 చివరినాటికి పూర్తి చేస్తామని, రోగుల జీవనవిధానం సరళీకృతం చేయాలనేది మా ఆశయమని ప్రకటించారు.

బల్లలు కొట్టడం, మోదీ నినాదాలకే బీజేపీ ఎంపీలు పరిమితం

▸▸ లక్ష్మణ సవది ఎద్దేవా



లక్ష్మణ సవది

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు ఐదేళ్లపాటు లోక్‌సభలో బల్లలు చరచడం, మోదీ మోదీ... అంటూ నినాదాలు చేయడం మినహా సాధించింది లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణ సవది ఎద్దేవా చేశారు. అథణిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 25మంది బీజేపీ ఎంపీలు షోకేస్ పీస్‌లంటూ వ్యంగ్యం చేశారు. ఇది నామాట కాదని బీజేపీకి చెందిన ఓ ఎంపీ ఇటీవల నన్ను కలసిన సందర్భంలో ప్రస్తావించారన్నారు. ఎంపీలు తమ నియోజకవర్గాలకు గ్రాంట్లు సాధించడంలోనూ విఫలం చెందారన్నారు. చిక్కోడి లోక్‌సభ నుంచి నేనుగానీ, నా కుమారుడు చిదానంద సవదిగానీ పోటీ చేయడం లేదన్నారు. ఇప్పటికే మా పార్టీ నేతలకు వివరించానన్నారు.

చెల్లిని ప్రేమించాడని... సజీవదహనం

▸▸ శివమొగ్గలో దారుణం

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చెల్లిని ప్రేమించాడని సమీప బంధువు అని కూడా చూడకుండా కారులో తీసుకెళ్లి సజీవదహనానికి పాల్పడిన సంఘటన శివమొగ్గ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని గాడికొప్ప గ్రామానికి చెందిన వీరేశ్ హత్యకు గురైన యువకుడు. శికారిపుర తాలూకా శిరాళకొప్ప సమీపంలోని తోగర్సి వద్ద ఇన్నోవాకారులో వీరేశ్‌ను బంధించి కారుకు నిప్పు పెట్టి పరారీ అయ్యారు. వీరేశ్ కుటుంబీకులు కనిపించడం లేదనే ఫిర్యాదుతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. శికారిపుర తాలూకాకు చెందిన ఓ యువతిని వీరేశ్ ప్రేమించాడు. ఇరువురూ సమీప బంధువులే. యువతి శివమొగ్గలో పీజీలో ఉంటూ ఫార్మసీ కోర్సు చదువుతోంది. కొంతకాలంగా ప్రేమ కొనసాగించిన వీరు పెళ్లి చేసుకుంటే ఆరంభంలో వ్యతిరేకించినా ఆ తర్వాత అంగీకరిస్తారని భావించారు. వీరి ప్రేమను యువతి అన్న ప్రవీణ్ జీర్ణించుకోలేకపోయారు. ప్రవీణ్ మిత్రులతో కలసి శుక్రవారం కొప్పలోని వీరేశ్ ఇంటికి వెళ్లాడు. చెల్లి చదువు పూర్తయ్యాక పెళ్లి చేస్తామని నమ్మబలికారు. చెల్లితో కలసి ఉండే ఫోటోలు, వీడియోలను డిలీట్ చేయాలని ఎక్కడైనా బయట పడితే కాలేజీలో చెల్లి పరువు పోతుందని సూచించారు. ప్రేమించిన యువతితో పెళ్లికి వారి కుటుంబీకులు అంగీకరించారని వీరేశ్ నమ్మాడు. ప్రియురాలితో ఉన్న ఫోటోలు, వీడియోలను మొబైల్‌లో డిలీట్ చేశాడు. శుక్రవారం రాత్రి 10 గంటలవేళ యువతి నిన్ను చూడాలని ఏడుస్తోందని, ఇంటికి రావాలంటూ వీరేశ్‌కు ఫోన్ చేశారు. అంతలోనే వీరేశ్ ఇన్నోవా కారులో తోగర్సి ప్రాంతానికి చేరుకున్నాడు. అప్పటికే వేచియున్న ప్రవీణ్, అతడి సహచరులు గొడవ చేసి అతడు వచ్చిన కారులోనే కూర్చోబెట్టి నిప్పుపెట్టారు. శనివారం ఉదయమైనా వీరేశ్ ఇంటికి రాకపోవడం, ఫోన్‌కు స్పందించకపోవడంతో తల్లి మహాదేవి స్థానిక తుంగానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతలోనే కారులో సజీవదహనం ఘటన వెలుగులోకి వచ్చింది. కారు నెంబరు ప్లేట్ ఆధారంగా మృతి చెందినది వీరేశ్‌గా గుర్తించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సిగ్మా నుంచి అత్యాధునిక లెన్స్‌లు

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతకు అనుగుణంగా విశ్వవ్యాప్తంగా ఫోటో కెమెరాలు, లెన్స్‌ల తయారీ సంస్థ సిగ్మా ఆధ్వర్యంలో అత్యాధునికమైన 500 ఎంఎం ఎఫ్ 5.6 డిజి లెన్స్‌లను మార్కెట్‌లోకి విడుదల చేసింది. స్పోర్ట్స్, వైల్డ్‌లైఫ్‌తోపాటు విభిన్నరంగాలలో నాణ్యమైన ఫోటోలను లెన్స్ ద్వారా బంధించేలా డిజైన్ చేశారు. నగరంలో ఇటీవల సిగ్మా కంపెనీ ముఖ్యులు మార్కెట్‌లోకి కొత్త లెన్స్‌లను విడుదల చేశారు. నగరంలోని పలు ప్రముఖ షోరూంలలో అందుబాటులో ఉంటాయని ప్రకటించారు.